క్లుప్తంగా

ఎస్ఆర్ఆర్‌లో క్యాంపస్ డ్రైవ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం దివీస్ ల్యాబ్, నేయాన్ లెన్సెస్, జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యాన క్యాంపస్ డ్రైవ్ జరిగింది. దీనిలో మొత్తం 241 మంది ఇంటర్వ్యూలకు హాజరవ్వగా 48 మందిని ఎంపిక చేశారు. దివీస్ ల్యాబ్‌లో ఉద్యోగాల కోసం 197 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరవ్వగా 39 మంది ఎంపికయ్యారు. మరో 45 మందిని తదుపరి ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. నేయాన్‌లెన్సెస్‌లో ఉద్యోగాల కోసం 44 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో తొమ్మిది మంది తర్వాత ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. దివీస్ ల్యాబ్‌కు ఎంపికైన వారు ఈనెల 20వ తేదీ లోపు విధుల్లో చేరాలని ఆఫర్ లెటర్లు అందజేశారు. డ్రైవ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, విజయదీప్ గుమ్మడి, డాక్టర్ వి.శ్రీనివాసరావు జవహర్ నాలెడ్జి సెంటర్ సిబ్బంది పర్యవేక్షించారు.

పారిశ్రామిక రంగంపై దృష్టి సారించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువత పారిశ్రామిక రంగం వైపు దృష్టి సారించాలని ఎన్ఎస్ఐసీ (నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్) డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎంవీ సోమశేఖర్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంబీఏ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం ఆ కాలేజీ ప్రాంగణంలో 'వ్యవస్థాపకత అభివృద్ధి'పై సదస్సును నిర్వహించారు. సోమశేఖర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి పారిశ్రామికరంగం అత్యంత కీలకమైనదన్నారు. ఆ రంగం వైపు విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. దానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వి.విజయదుర్గా ప్రసాద్, అధ్యాపకులు సుధాచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం పెంపొందించుకోవాలని కళాశాల విద్య ఆర్జేడీ డాక్టర్ సి.కృష్ణ పిలుపునిచ్చారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన కళాశాల విద్యార్థి ఎస్‌కే బాష అభినందన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్, అధ్యాపకులు డాక్టర్ డీవీవీ బాల సుబ్రహ్మణ్యం కళాశాల సిబ్బందితో కలిసి ఎస్‌కే బాషాను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను వేధిస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పటల్ జొన్నలగడ్డ మస్తాన్ వీధికి చెందిన సత్యాల రమ్య, మురళి భార్యభర్తలు. మూడేళ్ల క్రితం మురళీ అనారోగ్యంతో మరణించాడు. అతని స్నేహితుడు బిట్ర సురేష్ ఎల్ఐసీ డబ్బులు వచ్చే విషయంలో సాయం చేశాడు. దీంతో సురేష్, రమ్య వెంట పడి వేధిస్తున్నాడు. తాను చెప్పినట్టు వినాలని వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పూజా సామగ్రి సరఫరాకు టెండర్లు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో కిరాణా సామగ్రి, శేష వస్త్రములు, పూల దండలు సరఫరా నిమిత్తం శుక్రవారం సీల్డ్ టెండర్లు సమర్పించారు. దేవదాయ శాఖాధికారి సుపద్మదేవి సమక్షంలో ఈ టెండర్లు తెరిచి తక్కువ ధరకు కోట్ చేసిన వారికి ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి మాట్లాడుతూ పూజా ప్రసాద సామగ్రి, శానిటరీ వస్తువులు సరఫరా చేసే నిమిత్తం నలుగురు పోటీ పడగా శివకోటి నాగేశ్వరరావు జనరల్ స్టోర్స్, రామవరప్పాడు వారు తక్కువగా కోట్ చేశారన్నారు. అమ్మవారికి శేష వస్త్రాల సరఫరా నిమిత్తం ముగ్గురు పోటీ పడగా శ్రీ సూర్య టెక్స్ వారు తక్కువ ధరకు కోట్ చేశారని, పూలదండలు సరఫరా చేయడానికి నాగమణి ఫ్లవర్ స్టాల్, రామవరప్పాడు వారు తక్కువ ధర కోట్ చేశారని తెలిపారు. టెండర్ దక్కించుకున్నవారు ఈ ఏడాది డిసెంబర్ ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 30వ తేదీ వరకు ఆయా వస్తువులను సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్.. సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- పశ్చిమలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం



రోగులతో మాట్లాడుతున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి, గోదావరి గంగ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల్లో భాగంగా నియోజకవర్గంలోని 46, 47 డివిజన్లకు సర్కిల్-1 కార్యాలయం సమీపంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ఆయన శుక్రవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలన్న ఆలోచనతో సీఎం జగన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వైద్యరంగంలో సీఎం జగన్ తీసుకువచ్చిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పటల్స్‌ను ఆధునీకరించి వైద్యానికి పెద్ద పీట వేశారని అన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారి అనారోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఏడు రకాల పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం

టీడీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించారని గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడానికి చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చి 5 కాలేజీలను ప్రారంభించారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

పవన్ జత కట్టని పార్టీ ఉందా?

పవన్ కల్యాణ్ ఎన్డీఏతో ఉంటే మాకేంటి.. టీడీపీతో ఉంటే మాకేంటని వెలంపల్లి ప్రశ్నించారు. అతను జత కట్టని పార్టీ ఏదైనా ఉందా అంటూ ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలహీనపడ్డారని.. ఆయన్ని ఓడిస్తానని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికే పవన్, ఎందుకు అంత మందిని కలుపుకుని గుంపులు గుంపులుగా కలిసి రావల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. చంద్రబాబు, పావలా పవన్ కల్యాణ్, పనికిమాలిన పార్టీలన్నీ కలిసి వచ్చినా సీఎం జగన్‌ను ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్యాకేజీకి అమ్ముడుపోయి అతనికి ఊడిగం చేస్తున్న పవన్ కల్యాణ్ ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. ఒంటరిగా వచ్చే దమ్ము పవన్‌కు లేదని, అందుకే రిమాండ్ ఖైదీ చంద్రబాబుకు మద్దతు పలుకుతున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, విశ్వబ్రాహ్మణ, జైన్ కార్పొరేషన్ల చైర్మన్లు తోలేటి శ్రీకాంత్, మనోజ్ కొఠారి, వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు గోదావరి గంగ, అబ్దుల్ అర్షద్, డీఎంఓహెచ్ డాక్టర్ ఎమ్ సుహాసిని, సీఎమ్ఓహెచ్ డాక్టర్ రత్నావళి, సర్కిల్-1 ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్ డాక్టర్ రవి చంద్, వైఎస్సార్ సీపీ నాయకులు రాయన నరేంద్ర, గోదావరి బాబు, మైలవరపు కృష్ణ, ఎమ్‌డీఆర్, కామళ్ల జోజి, మద్దిరాల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు మల్లేశ్వరస్వామి ఆలయ పనులు

- ఆలయానికి చేరిన విగ్రహాలు
- పరిశీలించిన ఈవో, వైదిక కమిటీ



విగ్రహాలను పరిశీలిస్తున్న ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఆలయం చుట్టూ ప్రతిష్టించే 23 విగ్రహాలు శుక్రవారం దేవస్థానానికి చేరాయి. మహా మండపం వద్దకు చేరిన విగ్రహాలను క్రేన్‌తో స్వామి వారి ఆలయం వద్దకు చేర్చారు. ఆలయం చుట్టూ ప్రతిష్టించే విగ్రహాలను దుర్గగుడి ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. స్వామివారి ప్రధాన ఆలయం చుట్టూ ప్రతిష్టించే త్రిపురాంతకమూర్తి, దక్షిణామూర్తి, గజసంహారమూర్తి, భిక్షాటన మూర్తి, హరిహరమూర్తి, అర్ధనారీశ్వరమూర్తి, వృషభారుడ మూర్తి, వీరభద్రస్వామి, చతుర్ముఖ బ్రహ్మ, చంద్రశేఖరమూర్తి, సుబ్రహ్మణ్య స్వామి, లింగోద్భవమూర్తి, గణపతి స్వామి విగ్రహాలతో పాటు అష్ట దిక్పాలకుల విగ్రహాలు, పడమర భాగంలో మొదటి కర్ణకోట మధ్యభాగంలోని శరభమూర్తి, శిఖర భాగంలోని చతుర్ముఖ బ్రహ్మ విగ్రహాలను వైదిక కమిటీ పరిశీలించింది. ఆలయ ప్రధాన భాగాల్లో విగ్రహాల ఏర్పాటు పనుల పురోగతిని కాంట్రాక్టర్‌ను.. ఈవో భ్రమరాంబ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప, స్థేఈవో ఎస్. రమేష్‌బాబు, వైదిక కమిటీ సభ్యులు మురళీధర్ శాస్త్రి, శంకర శాండిల్య, యజ్ఞనారాయణశర్మ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కూరపాటి'లో ఉచిత దంత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కూరపాటి హైస్కూల్ వ్యవస్థాపకుడు కూరపాటి చంద్రశేఖరరావు 108వ జయంతిని పురస్కరించుకొని ఆ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య ఆధ్వర్యాన నిర్వహించిన వైద్య శిబిరంలో విద్యార్థులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సేవలను వినియోగించుకున్నారు. పాఠశాల కార్యదర్శి కూరపాటి నారాయణరావు, ఆపిల్ ఇంటర్నేషనల్ దంత వైద్యశాల వైద్యులు మూస, రాయల్ స్కూల్ అధినేత్రి షాహీనలు మాట్లాడుతూ విద్యార్థులు దంతాలపై నిర్లక్ష్యం చూపకూడదన్నారు. తొలుత విద్యార్థిని గౌరి చేసిన నృత్యం అలరించింది. ప్రిన్సిపాల్ యుగంధరాచార్య మాట్లాడుతూ దంతాలు దృఢంగా ఉండాలంటే పౌష్టికాహారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఝాన్సీ, రూప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రూట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

పెనమలూరు: రొమ్ము క్యాన్సర్‌పై అక్టోబర్ నెలలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లో శుక్రవారం రూట్స్ హెల్త్ ఫౌండేషన్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచటానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు రైల్వేస్టేషన్‌లో పింక్ రిబ్బన్, సంతకాల సేకరణ కార్యక్రమం చేపడతామని తెలిపారు. 12వ తేదీ ఉదయం 6 గంటలకు అశోక్‌నగర్ నుంచి కానూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 22వ తేదీన విజయవాడ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన, 29న కానూరు రూట్స్ కార్యాలయంలో రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేస్తామన్నారు. తొలిదశలోనే గుర్తించగలిగితే క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. సభ్యులు జి.వెంకటరమణ, సంజయ్.శర్మ, పద్మజ, కామేశ్వరి పాల్గొన్నారు.

నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

రామవరప్పాడు: ఇంజినీరింగ్ విద్య అనంతరం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు విద్యార్థి దశలోనే అందిపుచ్చుకోవాలని ఐఈటీఈ చైర్మన్ బి. రాజశేఖర్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎలక్ట్రానిక్స్- కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ టెలీ కమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) స్టూడెంట్ ఫోరమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఫోరమ్ ద్వారా విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు పెంపొందించే దిశగా పలు కార్యక్రమాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇమేజ్ ప్రాసెసింగ్, అప్లికేషన్ ప్రాముఖ్యతపై అవగాహన పరిచారు. మెడికల్ రంగంలో ఇమేజ్ ప్రాసెసింగ్‌ను విరివిగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఉన్నత విద్యతో పాటు అంతర్గత నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి శ్రీ గౌరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎనికేపాడులో నా మట్టి- నా దేశం కలశయాత్ర



కలశయాత్ర చేస్తున్న విద్యార్థినులు

రామవరప్పాడు: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయిలో ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో నా మట్టి- నా దేశం కలశయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల నుంచి సేకరించిన మట్టిని ఒకే కలశంలో కలిపి ఆ కలశాన్ని యాత్రగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము మాట్లాడుతూ ఈ కలశాన్ని ఎంపిక చేసిన చాంపియన్స్‌కు ఇచ్చి వారి ద్వారా ఢిల్లీలో గౌరవ ప్రధాన మంత్రి సమక్షంలో జరిగే జాతీయ స్థాయి కార్యక్రమానికి పంపిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెంచమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మధు, నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటింగ్ భీమాల వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెరిబ్రల్ పాల్సీని ప్రారంభం దశలో గుర్తించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సెరిబ్రల్ పాల్సీను ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి అన్నారు. స్థానిక అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ అనేది అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మూడు సంవత్సరాలలోపు చిన్నారులకు వచ్చే అవకాశం ఉందన్నారు. సెరిబ్రల్ పాల్సీ వచ్చిన చిన్నారులు చురుగ్గా ఉండలేక కొన్ని పనులు చేసేందుకు అవస్థ పడుతున్నారన్నారు. సెరిబ్రల్ పాల్సీ చిన్నారులకు సరైన చికిత్స ఇప్పించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందే అవకాశం ఉందన్నారు. సీపీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా ఆమె వివరించారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైను పునర్నిర్మాణం



నున్న(విజయవాడ రూరల్): గొల్లపూడి-అవుటపల్లి వరకు నిర్మించే నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం తవ్వకాలలో ధ్వంసమైన తాగునీటి పైపులైను పునర్నిర్మాణం కోసం శుక్రవారం పంచాయతీ పనులు ప్రారంభించింది. గ్రామ శివారు విశ్వబ్రాహ్మణ కాలనీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అపార్టుమెంటులోకి తాగునీటి సదుపాయం కోసం పైపులైను నిర్మిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలియజేశారు. దాదాపు ఆరు నెలల క్రితం నేషనల్ హైవే రోడ్డు పనులు చేసే కాంట్రాక్టు సంస్థ పైపులైను తొలగించిందన్నారు. ఆ సంస్థ రోడ్డు పూర్తి చేసిన తర్వాత పైపులైను పునర్నిర్మాణం కోసం పనులు ప్రారంభించామన్నారు. రెండు రోజుల్లో పైన పేర్కొన్న ప్రాంతాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించనున్నట్టు ఆయన తెలిపారు.

అలరించిన ఆపాత మధురాలు

విజయవాడ కల్చరల్: హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఆపాత మధురాలు కార్యక్రమం అలరించింది. సాయి లాహిరి లాహిరిలో సినీ సరిగమల సప్తస్వరాలు ఆధ్వర్యంలో అమర గాయకులకు స్వరనీరాజనం కార్యక్రమం జరిగింది. సీనియర్ గాయకుడు కేవీ రమణబాబు ఆధ్వర్యాన గాయనీ గాయకులు రూపశ్రీ, శివనాగలక్ష్మి, రసూల్‌బాబు, కృష్ణకుమారి, ప్రియలహరి, శ్యామ్‌సుందర్.. ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, సుశీల, భానుమతి గానం చేసిన గీతాలు మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, వివిధ సంస్థల ప్రతినిధులు మాంతి రమణ, జిలానీ ఖాన్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి



క్వారీ కార్మికులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రుక్మాందయ్య

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): క్వారీ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుక్మాందయ్య అన్నారు. కొండపల్లిలో ఇండియన్ లేబర్ లైన్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో క్వారీ కార్మికులు అసంఘటిత రంగ కార్మికులకు శుక్రవారం ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రుక్మాందయ్య మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పథకాలు అందిపుచ్చుకునేలా చైతన్యం ఉండాలన్నారు. డీబీఆర్సీ రీజినల్ కో-ఆర్డినేటర్ రమాదేవి, లేబర్‌లైన్ కోఆర్డినేటర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

గన్నవరంరూరల్: వైఎస్సార్ బీమా పథకం కుటుంబాలకు అండగా నిలుస్తుందని ముస్తాబాద సర్పంచ్ వేము రాధాకృష్ణ చెప్పారు. మండలంలోని ముస్తాబాదలో ఇటీవల గుండెపోటుతో మరణించిన బొడ్డపాటి విజయ్ కొండలరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా రూ.10వేలు తక్షణ సహాయాన్ని శుక్రవారం సర్పంచ్ ఆ కుటుంబానికి అందజేశారు. వార్డు సభ్యురాలు శ్రీలక్ష్మి, సచివాలయం-1 ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్ జెట్టి నానారావు పాల్గొన్నారు.

15 నుంచి చినకంచిలో దసరా నవరాత్రులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం(చినకంచి)లో ఈ నెల 15వ తేదీ నుంచి శ్రీకామాక్షి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రతి రోజు అలంకారములు, అర్చనలు, చండీ పారాయణలు, శ్రీమహావిద్య పారాయణలు, చండీ, క్షమహావిద్యాహోమాలు, ఖడ్గమాల, కుంకుమ పూజలు జరుగుతాయని, భక్తులందరూ ఈ ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

జగనన్న కాలనీలకు మౌలిక వసతులు

కంచికచర్ల : జగనన్న కాలనీ లే అవుట్‌లలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. మండలంలోని గండేపల్లి జగనన్న లేఅవుట్ కాలనీలో పనిచేయని విద్యుత్ మోటార్‌కు శుక్రవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీరు, విద్యుత్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రోడ్లను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు చేయించినట్లు వివరించారు. లబ్ధిదారులంతా సకాలంలో ఇళ్ల నిర్మాణపనులు పూర్తిచేసుకుంటే, గృహనిర్మాణశాఖ వెంటనే బిల్లులు చెల్లిస్తుందని, త్వరితగతిన పనులు పూర్తిచేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల పరిధిలో వార్డుల విభజన

నున్న(విజయవాడరూరల్): ప్రజల సౌకర్యార్థం నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు సచివాలయాల పరిధిలో వార్డులను విభజన చేసినట్టు పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలియజేశారు. 1వ సచివాలయం పరిధిలో 6,7,8,14,15 వార్డులు, 2వ సచివాలయం పరిధిలో 1,2,3,4,5 వార్డులు, 3వ సచివాలయం పరిధిలో 9,10,11,12,13 వార్డులను విభజన చేసినట్టు ఆయన తెలియజేశారు. ఈ ప్రకారం ప్రజలు తమ అవసరాలకు పైన తెలియజేసిన సచివాలయాలకు వెళ్లి సేవలను పొందవచ్చునన్నారు.

లేగదూడల ప్రదర్శన

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు):పశుగణాభివృద్ధి సంస్థ, గన్నవరం వారి ఆధ్వర్యంలో శుక్రవారం గుమ్మడిదుర్రులో లేగదూడల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. లేగదూడలను యజమానులు ప్రత్యేకంగా అలంకరించారు. పోటీలను సర్పంచ్ నక్కా కమల ప్రారంభించారు.

మాతా శిశుమరణాలు నివారించాలి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో మాతా శిశు మరణాలకు కారణాలను అన్వేషించి పూర్తి స్థాయిలో నివారించాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లాను మాతా శిశు మరణాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలన్నారు. శుక్రవారం మాతాశిశు మరణాలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలలో సంభవించిన మాతా శిశు మరణాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సమీక్షలు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నా ఇంకా మరణాలు సంభవిస్తూనే ఉన్నాయన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో 39 మాతా శిశు మరణాలు సంభవించాయన్నారు. వీటిపై పూర్తి స్థాయిలో చర్చించి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని తెలిపారు. మాతా శిశు మరణాల్లో వైద్యుల నిర్లక్ష్యం లేకపోయినా, ఇటువంటివి సంభవించకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులపై ఉందన్నారు. నిరుపేద కుటుంబాల్లోనే మరణాలు సంభవించడం బాధాకరమని తెలిపారు. గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి వైద్య పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించాలని తెలిపారు. మాతా శిశు మరణాల్లో వైద్యుల నిర్లక్ష్యం గుర్తిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోను నిర్వహిస్తున్నామన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఎం అండ్ హెచ్‌ఓ ఎం. సుహాసిని, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ శిక్షణతో ఉపాధి



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇస్తే మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని స్టెల్లా కళాశాల అకాడమిక్ ఆఫీసర్ డాక్టర్ లీనా క్వాడ్రస్ అన్నారు. కళాశాల్లో ఆమె శుక్రవారం ఐటీ కన్వర్జెంట్ గ్లోబల్ ఎంబీఏ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా ప్రారంభమయ్యే ఈ ప్రోగ్రాంలో ఇంటిగ్రేటెడ్ కేంబ్రిడ్జ్ ఇంగ్లిష్‌తో విద్యార్థులు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచుకోవచ్చన్నారు. 100 శాతం అస్యూర్డ్ ప్లేస్‌మెంట్‌లతో గ్రాడ్యుయేట్‌లకు కెరీర్ అవకాశాలను హామీ ఇస్తున్నామని, ఏడాదికి రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ప్యాకేజీలు ఉంటాయన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంబీఏ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ లావణ్య, రీసెర్చి డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊబకాయంపై విద్యార్థులకు పోటీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): బాలల్లో ఊబకాయంతో భవిష్యత్తులో దుష్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థుల్లో ఊబకాయంపై అవగాహన కలిగించడానికి శుక్రవారం ఎంజే నాయుడు ఆస్పత్రి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ఆస్పత్రి 37వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల ప్రారంభోత్సవంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఎంజే నాయుడు ఆసుపత్రి ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. హాస్పటల్ చైర్మన్ వావిలాల రజనీకాంత్ శర్మ, ఎంజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.



